RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in    rajadhanivoicedaily@gmail.com

రాజధాని వాయిస్ TELUGU DAILY

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కోనసాగుటకు గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు మండలాల వారిగా విలేఖరులు కావవలెను ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 313 | 04 ఆదివారం అక్టోబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

# శ్రీసిటీలో బాయిలర్ పేలుడు విషాదం

- నలుగురు కార్మికుల మృతితో తీవ్ర విషాదం
- చంద్రబాబు ఆదేశాలతో సహాయక చర్యలు
- లోకేశ్, అనిత సంతాపం వ్యక్తం



**తిరుపతి, రాజధాని వాయిస్** : తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో శనివారం జరిగిన బాయిలర్ పేలుడు ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఫ్యాక్టరీలో ఉన్న వాటర్ బాయిలర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోవడంతో నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో పరిశ్రమ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ప్రమాదం జరిగిన సమయంలో కార్మికులు తమ విధుల్లో నిమగ్నమై ఉన్నట్లు సమాచారం. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలతో మరో ఇద్దరిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ వారు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**- మృతుల కుటుంబాలకు అండగా నిలిచిన చంద్రబాబు**

**- గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు**

రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కూడా ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది అత్యంత బాధాకరమైన సంఘటన అని పేర్కొంటూ మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఆయన, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

**- అనిత ఆరా.. అధికారులకు కీలక ఆదేశాలు**

**- ప్రమాద కారణాలపై విచారణ ప్రారంభం**

రాష్ట్ర హోంమంత్రి అనిత కూడా ఘటనపై స్పందించి తిరుపతి జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించడంతో పాటు మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ప్రమాదానికి గల కారణాలను గుర్తించేందుకు అధికారులు విచారణ చేపట్టగా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ ఆవిష్కరణ

- ఆవిష్కరణలకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ - ఐటీలతో కీలక భాగస్వామ్యంపై చర్చలు
- సాంకేతిక రంగంలో అగ్రస్థానమే లక్ష్యం - ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు




**విజయవాడ, రాజధాని వాయిస్** : సాంకేతిక ఆవిష్కరణలు, పరిశోధనలకు ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలో నిర్వహించిన పాన్ ఐఐటీ సదస్సులో పాల్గొన్న ఆయన, రాష్ట్రాన్ని ఆధునిక సాంకేతికతకు కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యాన్ని వివరించారు. దేశ భవిష్యత్తును నిర్దేశించే సాంకేతిక రంగాల్లో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించబోతుందని పేర్కొన్నారు. అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 3న దీనిని ఆవిష్కరించనున్నామని తెలిపారు. ఈ సాంకేతిక వేదిక ద్వారా దేశవ్యాప్తంగా అవసరమైన సేవలు అందించగల సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. భవిష్యత్ సాంకేతిక విప్లవానికి అమరావతి కేంద్రబిందువుగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సదస్సులో భాగంగా వివిధ ఆవిష్కరణలు, నూతన సంస్థల ప్రదర్శనలను ముఖ్యమంత్రి పరిశీలించారు. పెట్రోల్‌తో నడిచే ద్విచక్ర వాహనాలను విద్యుత్ వాహనాలుగా మార్చే సాంకేతికత, ఆరోగ్య సమాచారాన్ని వేగంగా అందించే ఆధునిక విధానాలు, మానవరహిత వైమానిక పరికరాల అభివృద్ధి వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఉపయోగకరమైన సాంకేతికతలను రాష్ట్రంలో అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. దేశంలోని ప్రముఖ సాంకేతిక విద్యాసంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యుత్తమ పరిశోధనా కేంద్రాల ఏర్పాటు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, పట్టణాభివృద్ధిలో ఆధునిక విజ్ఞాన వినియోగం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించే దిశగా విద్యా సంస్థలు, పరిశ్రమలు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో భారతీయులు కీలక స్థానాల్లో ఉన్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశ అభివృద్ధి కోసం ప్రతిభావంతులైన నిపుణులు, పరిశోధకులు, వ్యాపారవేత్తలు ఒకే వేదికపైకి రావాలని పిలుపునిచ్చారు. గతంలో సమాచార సాంకేతిక రంగంలో సాధించిన విజయాల మాదిరిగానే భవిష్యత్తు సాంకేతిక రంగాల్లోనూ దేశం ముందంజలో నిలవగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. సాంకేతిక అభివృద్ధి, ఆవిష్కరణలు, పరిశోధనల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచస్థాయి కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. యువతలో సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ నూతన అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో సాంకేతిక రంగం కీలక శక్తిగా మారబోతోందని ఆయన పేర్కొన్నారు.

# ఎన్నికల ప్రక్రియపై ఖర్గే సంచలన వ్యాఖ్యలు

**కలబురగి, రాజధాని వాయిస్** : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై దేశవ్యాప్తంగా రాజకీయ చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శ కతపై సందేహాలు వ్యక్తం చేస్తూ ప్రస్తుతం దేశంలో నిర్వహించిన ఎన్నికలపై ప్రశ్నలు లేవనెత్తారు. కర్ణాటకలోని కలబురగిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, ఎన్నికల సంఘం వ్యవహార తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయని ఖర్గే పేర్కొన్నారు. ఎన్నికల సంఘంలో సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు వెలుగులోకి రావడం కూడా ఆందోళనకర అంశమని అన్నారు. ఓటరు జాబితాల తయారీ, సవరణ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం కలిగేలా చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు.దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియపై సమగ్ర సమీక్ష అవసరమని ఖర్గే పేర్కొన్నారు. ఈ క్రమంలో లోక్‌సభతో పాటు రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేసి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఇది అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాత ధోరణి ఉండాలని కూడా కోరారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగంపై కూడా ఖర్గే సందేహాలు వ్యక్తం చేశారు.



# ప్రపంచానికి ఆదర్శంగా అమరావతి: లోకేష్



**విజయవాడ, రాజధాని వాయిస్** : ప్రపంచానికి భారత అభివృద్ధి నమూనాను చూపించే కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దాలని రాష్ట్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందే విధంగా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. విజయవాడలో నిర్వహించిన పాన్ ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సదస్సును ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విద్యావేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రతి రంగంలో అగ్రస్థానంలో నిలవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి చేరుకోవడానికి ప్రపంచంలోని అనేక దేశాలకు దశాబ్దాల సమయం పట్టిందని గుర్తు చేశారు. అయితే సాంకేతికత, నూతన ఆవిష్కరణలు, సమర్థ పాలన ద్వారా వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాబోయే పదేళ్లలో భారత్ ప్రపంచంలో ప్రముఖ ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని, ఆ ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.రాష్ట్ర అభివృద్ధికి వేగం, సేవలు, స్థిరత్వం అనే మూడు ప్రధాన అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ముందుకు సాగుతున్నామని లోకేశ్ వివరించారు. పెట్టుబడిదారులు రాష్ట్రం వైపు ఆకర్షితులయ్యేలా అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తున్నామని తెలిపారు. కేవలం ఒప్పందాలకే పరిమితం కాకుండా పరిశ్రమలు వాస్తవంగా ఏర్పాటై ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సంస్కరణలను ప్రకటించడం మాత్రమే కాకుండా వాటిని సమర్థంగా అమలు చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయం, ఉద్యానవన రంగాలు, పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. గ్రామీణాభివృద్ధి నుంచి ఆధునిక సాంకేతిక రంగాల వరకు అన్ని విభాగాల్లో సమగ్ర పురోగతి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆవిష్కరణలు, పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి ద్వారా యువతకు కొత్త అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని లోకేశ్ చెప్పారు. రాష్ట్రంలోని విద్యా సంస్థలు, పరిశ్రమలు, పరిశోధనా కేంద్రాలు పరస్పర సహకారంతో పనిచేస్తే ప్రపంచ స్థాయి ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. యువత తమ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో పాన్ ఐఐటీయన్లు, ఐఐటీల డైరెక్టర్లు, ప్రముఖ సంస్థల ప్రధాన కార్యనిర్వాహకులు, నూతన సంస్థల వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు, విధాన నిర్ణేతలు పాల్గొన్నారు. రాష్ట్రంలో సాంకేతికత, ఆవిష్కరణలు, పరిశ్రమల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. భవిష్యత్ అభివృద్ధి వ్యూహాల రూపకల్పనలో ఈ సదస్సు కీలక వేదికగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

# 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన.. నేడు తెనాలికి సీఎం

**తెనాలి, రాజధాని వాయిస్** : రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన--గ్రామీణ్ (PMAY-G) 2.0 కింద కేంద్రం మంజూరు చేసిన మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో ఈ కార్యక్రమం జరగనుంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 28 నెలల్లో ఇప్పటికే 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది. గతేడాది నవంబరులో 3 లక్షలు, ఈ ఏడాది మార్చిలో 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు నిర్వహించింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం తాజాగా మరో 3 లక్షల ఇళ్లను మంజూరు చేయడంతో నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మరో 4.20 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**దేశంలోనే తొలిసారిగా 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ**

గృహ నిర్మాణ రంగంలో ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చేలా దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణ పైలట్ ప్రాజెక్టుకు కూడా చంద్రబాబు, శివరాజ్‌సింగ్ చౌహాన్ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సీఎస్ఐఆర్--సీబీఆర్ఐ (రూర్కీ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. బుర్రిపాలెం, ఓబులనాయుడు పాలెం గ్రామాల్లో రూ.14 కోట్ల అంచనా వ్యయంతో 177 ఇళ్లను నిర్మించనున్నారు. 3డీ ప్రింటింగ్ సాంకేతికతతో నిర్మాణ సమయం, శ్రమ, వ్యర్థాలను తగ్గించడంతో పాటు నాణ్యత, పటిష్ఠతను పెంచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



## ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూత



చెన్నై: ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు(94) కన్నుమూశారు. వయోభారంతో చెన్నై కావేరి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. చివరిగా నాగ్ అశ్విన్ నిర్మాణంలో 'సింగ్ గీతం' చిత్రానికి దర్శకత్వం వహించారు. 94 ఏళ్ల వయసులో దర్శకత్వం వహించి పలువురు విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. పుష్పక విమానం, ఆదిత్య 369, భైరవద్వీపం, మయూరి, విచిత్ర సోదరులు తదితర చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు.1931 సెప్టెంబర్ 21న నెల్లూరు జిల్లా ఉదయగిరిలో జన్మించారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలలో చదువుకున్నారు. హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ ఆధ్వర్యంలో నాటకాల్లోకి రంగ ప్రవేశం చేశారు. కళాశాల రోజుల్లోనే హాలీవుడ్ చిత్రాలపై మక్కువ పెంచుకున్నారు. తెలుగుతోపాటు పలు భాషల్లో సినిమాలకు దర్శకత్వం వహించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో 60కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించారు. భారతీయ సినీ రంగంలో వినూత్న ప్రయోగాలకు చిరునామాగా మారారు. పుష్పక విమానం సినిమాతో సంచలనం సృష్టించారు. మాటలు లేకుండా సినిమాను రూపొందించారు. రెండు జాతీయ పురస్కారాలు, ఐదు నంది అవార్డులు, పలు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు.

## బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఏపీ ప్రభుత్వం



**అమరావతి, రాజధాని వాయిస్** : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల వ్యవహారంలో ఇటీవల రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయి ంచింది. 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసిన సంగతి తెలిసిందే. బీసీలకు రిజర్వేషన్ల విషయంలో తాము కట్టుబడి ఉన్నట్లు ఇప్పటికే సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు.

## బీసీ రిజర్వేషన్లపై వైసీపీకి హక్కులేదు: రామ్మోహన్ నాయుడు

**పాతపట్నం, రాజధాని వాయిస్** : శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గోవిందరావుతో కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఆయన అనంతరం నిర్వహించిన సభలో బీసీ రిజర్వేషన్ల అంశంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడే నైతిక హక్కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి లేదని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై కోర్టు తీర్పులు వచ్చినప్పుడు అప్పటి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యం దక్కకుండా చేయడంలో వైసీపీ పాలన వైఫల్యం చెందిందని విమర్శించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ప్రస్తుత కూటమి ప్రభుత్వం న్యాయపరంగా పోరాటం చేస్తోందని మంత్రి తెలిపారు. బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో వెనుకబడిన వర్గాలకు అవకాశాలు పెరగాలనే ఉద్దేశంతో చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. తెలుగుదేశం పార్టీ గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని ఆయన గుర్తు చేశారు. బీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి తమ పార్టీ ఎప్పటి నుంచో కృషి చేస్తోందని అన్నారు. వెనుకబడిన వర్గాలకు నాయకత్వ అవకాశాలు పెరగడం ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.బీసీలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నదే తమ లక్ష్యమని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. పార్టీ నిర్మాణంలోనూ, ప్రజా ప్రతినిధుల వ్యవస్థలోనూ బీసీలకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. బీసీల అభ్యున్నతికి సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సామాజిక న్యాయానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు.

# రూ.1.40 కోట్లతో తారు రోడ్డు పనులకు శ్రీకారం

- రుద్రవరం పంచాయతీలో అభివృద్ధి పనుల ప్రారంభం
- ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాల లక్ష్యం
- మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం, రాజధాని వాయిస్ :** మచిలీపట్నం రూరల్ మండలం రుద్రవరం పంచాయతీ పరిధిలో రూ. 1.40 కోట్ల వ్యయంతో చేపట్టనున్న తారు రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి కొల్లు రవీంద్ర శంకుస్థాపన చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గ్రామంలోని ప్రధాన మార్గం వరకు నిర్మించనున్న ఈ రహదారి పనుల ప్రారంభ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కొల్లు రవీంద్ర, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు అవసరమైన రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే మార్గం మెరుగుపడడం వల్ల గ్రామ ప్రజలకు, ముఖ్యంగా రోగులకు ప్రయాణ సౌకర్యం మెరుగవుతుందని తెలిపారు. రహదారి నిర్మాణంతో రవాణా సమస్యలు తగ్గి గ్రామ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎలాంటి రాజీ ఉండకూడదని మంత్రి అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజాధనంతో చేపడుతున్న ప్రతి పనిలో పారదర్శకత, నాణ్యత పాటించాలని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పంతం గజేంద్ర, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, రూరల్ పార్టీ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు, గ్రామస్థులు కూడా హాజరై అభివృద్ధి పనుల ప్రారంభాన్ని స్వాగతించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

# నారా లోకేష్ చొరవతో ఏళ్ల నాటి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



**మంగళగిరి, రాజధాని వాయిస్ :** మంగళగిరి పట్టణంలోని 15, 16, 17, 18, 19, 20, 24, 25 వార్డుల పరిధిలో ఏళ్ల తరబడి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యకు మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ చొరవతో పరిష్కారం లభించిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య తెలిపారు. కొప్పారావు కాలనీలో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నందం అబద్ధయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో డ్రైనేజీ సమస్యతో ప్రజలు అనేక సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. సమస్యను పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదన్నారు. మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను స్థానిక ప్రజలు కలిసి తమ సమస్యలను వివరించగా, ఆయన వెంటనే స్పందించారని నందం అబద్ధయ్య తెలిపారు. సంబంధిత అధికారులతో సర్వే నిర్వహించి, సమస్య తీవ్రతను గుర్తించి సుమారు రూ. 1.20 కోట్లతో నూతన డ్రైనేజీ నిర్మాణానికి టెండర్లను ఖరారు చేయించినట్లు చెప్పారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవడం నారా లోకేష్ ప్రత్యేకత అని నందం అబద్ధయ్య పేర్కొన్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు నూతన డ్రైనేజీ నిర్మాణం ద్వారా శాశ్వత పరిష్కారం లభించనుందని, దీనివల్ల తొమ్మిది వార్డుల పరిధిలోని ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని, మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ చొరవతో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని నందం అబద్ధయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు, పట్టణ టీడీపీ అధ్యక్షులు పడవల మహేష్, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, రాష్ట్ర స్వచ్ఛంద కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు దామర్ల రాజు, బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు, లక్ష్మీనరసింహస్వామి స్వర్ణకార సంఘం అధ్యక్షులు గుంటి నాగరాజు, గోసాల రాఘవ, జొన్నాదుల బాలకృష్ణ, బీజేపీ నాయకులు పంచుమర్తి ప్రసాద్ (చిన్నా), 20వ వార్డు మాజీ కౌన్సిలర్ బట్టు చిదానంద శాస్త్రి, 18వ వార్డు మాజీ కౌన్సిలర్ దామర్ల పద్మజ, 19వ వార్డు అధ్యక్షులు చెల్లూరి వీర వెంకట సత్యనారాయణ, తిరువీధుల సతీష్, బిట్ర దుర్గారావు, ఉపాధ్యక్షులు దామర్ల భిక్షారావు, ప్రధాన కార్యదర్శి తాడిచెర్ల వీరన్న, జంజనం వెంకట సుబ్బారావు, వార్డు కమిటీ సభ్యులు చిన్నం శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు, వెనిగళ్ల రమేష్, మునగాల బాలాజీ, తాడిపర్తి సురేష్ కృష్ణ, కౌతరపు దుర్గాప్రసాద్, గోలి వెంకటేష్, చిల్లపల్లి వీరమ్మ, బండి రమణమ్మ, దివి మల్లేశ్వరి, మల్లూరి నాగేశ్వరమ్మ స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# 22ఏ భూ సమస్యల పరిష్కారం దిశగా మరో కీలక నిర్ణయం



**హైదరాబాద్, రాజధాని వాయిస్ :** రాష్ట్రంలో 22ఏ భూముల సమస్యల పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నాలా అనుమతి లేకుండా నివాస వినియోగం లోకి వచ్చిన పట్టాభూముల రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించింది. నాలా రుసు ము చెల్లిస్తే అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్లు చేయాలని తీర్మానించింది. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. అర్హత ఉన్న అన్ని దరఖాస్తులను కాలపరిమితిలో పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. 22ఏ భూ సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వం ఇప్పటికే ఐదు జీవోలు జారీ చేసింది. ఈ సమస్య పరిష్కారంపై అధ్యయనం చేసేందుకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు ఉన్న 22ఏ ఇళ్లు, ఫ్లాట్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి మంజూరు చేసింది. కొని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న యూఎల్‌సీ దరఖాస్తుల పరిష్కారానికి ఉత్తర్వులు జారీ చేసింది.

# కలెక్టర్‌కు వైఎస్సార్‌సీపీ నేతల వినతి



**నెల్లూరు, రాజధాని వాయిస్ :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి పాటించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడిన పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ అనుచిత పద్ధతులను అనుసరించే అవకాశం ఉందంటూ ఆరోపించారు. ఓటర్ల జాబితాల తయారీలో లోపాలు ఉన్నాయని, కొందరు అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగించబడుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఓటరికి తన హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలను ఎన్నికల సమయంలో నిష్పక్షపాతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రతిపక్ష నాయకులపై జరుగుతున్న అరెస్టులు, నిర్బంధ చర్యల అంశాన్ని కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఎన్నికల వాతావరణంలో శాంతిభద్రతలు, ప్రజాస్వామ్య విలువలు కాపాడాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. నెల్లూరు జిల్లాలో గతంలో లేనివిధంగా రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయని పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు నిర్వహిస్తే ప్రజల అభిప్రాయం స్పష్టంగా వెలుగులోకి వస్తుందని అన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి బెదిరింపులు, ఒత్తిళ్లు లేకుండా ఓటర్లు తమ హక్కును వినియోగించుకునే పరిస్థితులు కల్పించాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల మధ్య పరస్పర గౌరవం ఉండాలని, అభ్యంతరకర వ్యాఖ్యలు, ఉద్రిక్తతలకు దారితీసే చర్యలు నివారించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో చట్టబద్ధ విధానాలను కచ్చితంగా అమలు చేసి ప్రతి రాజకీయ పార్టీకి సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు ఎమ్మెల్సీ తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల తరఫున తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరు గ్రామాల విలీనానికి తొలి అడుగు



**గుడివాడ, రాజధాని వాయిస్ :** గుడివాడ పురపాలక సంఘ పరిధి విస్తరణకు సంబంధించి ఆరు గ్రామపంచాయతీల విలీన ప్రక్రియకు తొలి అడుగు పడింది. ఈ మేరకు గుడివాడ ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించగా ఆర్డీఓ జీ. బాలసుబ్రమణ్యం, పురపాలక కమిషనర్ సింహాద్రి మనోహర్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. విలీన ప్రక్రియకు సంబంధించిన పరిపాలనా, అభివృద్ధి అంశాలపై సమగ్రంగా చర్చించారు. లింగవరం, వలివర్తిపాడు, మల్లయ్యపాలెం, బొమ్ములూరు, బిళ్లపాడు, భూషణగుళ్ల గ్రామాల విలీనానికి సంబంధించిన రికార్డులు, ఉద్యోగుల వివరాలు, ప్రభుత్వ ఆస్తులు, మౌలిక వసతులు, కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా ఉన్న పరిస్థితులను అధ్యయనం చేసి తదుపరి కార్యాచరణ రూపొందించేందుకు అధికారులు సమాచారాన్ని సేకరించారు. విలీన గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ప్రాధాన్యత ఆధారంగా వర్గీకరించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులకు సూచించారు. అత్యవసర అవసరాలను గుర్తించి వాటిని ఏ, బీ, సీ విభాగాలుగా విభజించి సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. ప్రజలకు అత్యంత అవసరమైన పనులను ముందుగా పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. త్రాగునీటి సరఫరా, రహదారుల నిర్మాణం, మురుగునీటి పారుదల వ్యవస్థ, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. విలీన గ్రామాల ప్రజలకు పట్టణ స్థాయిలో సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గ్రామాలు పురపాలక సంఘంలో విలీనం అయిన తర్వాత అభివృద్ధి పనుల్లో ఎలాంటి వివక్ష ఉండదని వెనిగండ్ల రాము స్పష్టం చేశారు. గుడివాడ పట్టణానికి ఇచ్చే ప్రాధాన్యతనే విలీన గ్రామాల అభివృద్ధికీ కల్పిస్తామని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అన్ని శాఖల సమన్వయంతో పనులు చేపడతామని వివరించారు. విలీన ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని అధికారులు తెలిపారు. పరిపాలనా పరమైన అన్ని అంశాలను పరిశీలించి దశలవారీగా ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామాల అభివృద్ధి, పట్టణ విస్తరణ, మెరుగైన పౌరసేవల కల్పనే ఈ విలీన ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని సమావేశంలో పేర్కొన్నారు.

# చంద్రబాబూ.. మీ డ్రామాలు, బిల్డప్‌లు కట్టిపెట్టండి: వైఎస్ జగన్



**తాడేపల్లి, రాజధాని వాయిస్ :** హార్టికల్చర్‌కు రూ.లక్ష కోట్లంటూ చంద్రబాబు చేసిన ప్రకటనపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పిట్టలదొర మాటలు మానుకోవాలని సూచిం చారు. చంద్రబాబు డ్రామాలు, బిల్డప్‌లు కట్టిపెట్టాలని అన్నారు. రూ. లక్ష కోట్లు కాదని, రైతులకు లక్ష మోసాలు అంటూ ట్వీట్ చేశారు. "చంద్రబాబూ.. రాయలసీమలో హార్టికల్చర్‌కు రూ.లక్ష కోట్లు అంటూ మీరు చేస్తున్నవి డ్రామాలు, అంకెలగారడీలు కాక మరేమిటి? బడ్జెట్లో కేటాయింపులు లేకుండా, ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా, రైతుల్ని ఇంతలా మభ్యపెట్టడం మీకు మాత్రమే సాధ్యం. రైతుల మీద మీ ప్రేమ, మాటలకు, ప్రచారాలకు మాత్రమే పరిమితం అని రెండున్నరేళ్ల మీ పాలనే పలుమార్లు రుజువు చేసింది. హార్టికల్చర్ సహా పంటలకు ధరల్లేక రైతులు రోడ్డున పడితే రోజూ ధర్నాలు చేస్తే మీరు ఏరోజైనా పట్టించుకున్నారా?" అని వైఎస్ జగన్ అన్నారు.

**రైతుల వెన్ను విరిచారు..**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెట్టిన ధరల స్థిరీకరణ నిధిని నిర్వీర్యంచేసి, ఉచిత పంటల బీమాను తీసివేసి రైతుల వెన్ను విరిచిన మాట వాస్తవం కాదా? అని వైఎస్ జగన్ ప్రశ్నించారు. "సున్నా వడ్డీ పథకాన్ని రద్దుచేసి, సమయానికి ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీని నిర్వీర్యంచేసి, రైతుల నడ్డివిరిచారు. మీరు పబ్లిసిటీ డ్రామాలు చేసి, వాటినే నిజాలుగా ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తారు తప్ప, రైతుల కష్టసుఖాల గురించి ఏరోజూ పట్టించుకోరనడానికి ఇంతకన్నా సాక్ష్యం ఏం కావాలి? తీవ్రమైన కరువు కారణంగా రాయలసీమలో ఇప్పుడు తీవ్ర దుర్భిక్షం నెలకొంటే, వేలాది ఎకరాల్లో హార్టికల్చర్ తోటలు ఎండిపోతుంటే, మీరు వాటర్ మ్యాన్ అని బిల్డప్ ఇవ్వడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ఓ పక్క రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుకు మీరే అడ్డుతగులుతున్నారు. మరోపక్క ఒక్క రాయలసీమ ప్రాంతంలోనే దాదాపుగా 7-8 లక్షల బోర్లు ఎండిపోయాయి. ఈ పరిస్థితుల్లో రైతులు ట్యాంకర్ నీటికోసం రూ. 1500 నుంచి రూ. 2,000లు ఖర్చుచేసి, ఆ చెట్లను బతికించేందుకు నానా అగచాట్లు పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇక హార్టికల్చర్ హబ్ సంగతి పక్కనపెడితే, రైతుల ఆత్మహత్యలకు చిరునామాగా, రాయలసీమ సహా రాష్ట్రం మొత్తం తయారయ్యింది. చంద్రబాబూ.. మీ డ్రామాలు, బిల్డప్‌లు కట్టిపెట్టి, రైతులకు ఊరటనిచ్చేలా తక్షణమే కరువు నివారణా చర్యలు మొదలు పెట్టండి" అంటూ వైఎస్ జగన్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

# 'ఇప్పుడున్నది లోకేష్ కనుసన్నల్లో పనిచేసే చంద్రబాబు'



**విజయవాడ, రాజధాని వాయిస్ :** ఏపీలో ఇప్పుడంతా క్యాష్, క్యాష్, క్యాష్.. ఇదే నడుస్తుందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత పేర్ని నాని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఏ పని జరగాలన్నా క్యాష్ కొడితేనే పని అవుతుందని విమర్శించారు. ప్రజలు భయంతో బ్రతికే రోజులు వచ్చేశాయని, టీవీ చానల్స్‌ను కూడా డబ్బు ఎరవేసి లోబరుచుకుంటున్నారని పేర్ని నాని స్పష్టం చేశారు. ఇప్పుడు కనిపిస్తున్న చంద్రబాబు పాత చంద్రబాబు కాదని, ఇప్పుడున్నది లోకేష్ కనుసన్నల్లో పని చేసే చంద్రబాబన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి వికేంద్రీకరణ చర్చా వేదిక ఆధ్వర్యంలో విజయవాడలో 'రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహించారు. ప్రభుత్వ రంగ పరిరక్షణలో అనే అంశంపై రౌండ్ టేబుల్ మీటింగ్‌లో చర్చ జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి, టిడిపి సీనియర్ నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీమంత్రి పేర్ని నాని, ప్రొ. సి. రామచంద్రయ్య, సామాజిక కార్యకర్త డా. వసుంధర, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పేర్ని నాని మాట్లాడుతూ.. 'పిపిపి ద్వారా ఈ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. ఓటేసి గెలిపించిన జనం ఎలా పోయినా పర్వాలేదు అనే ఆలోచనలో ఉన్నారు. ప్రజలు పన్నులు చెల్లించాలి. .చంద్రబాబు అండ్ కో హెలికాప్టర్లలో తిరుగుతారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు కట్టబెడుతున్నారు. ప్రైవేట్ నిర్వహణకు ఇచ్చి జీతభత్యాలు ప్రజల సొమ్ము ఇస్తామంటున్నారు. ఇంతకంటే బరితెగింపు ఏముంది?, రాజధాని మొత్తం కరెంట్ కోసం ప్రైవేట్‌కు కట్టబెట్టారు. ఏపీలో ఉన్న ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు. ఆర్టీసీకి చెందిన 12 డిపో లను ప్రైవేట్ కు కట్టబెట్టారు. ఫ్రీ బస్ స్కీమ్ పేరుతో ఆర్టీసీకి నెలకు రూ. 150 కోట్లు ప్రభుత్వం అప్పులు పెడుతుంది. రూ. 7 వేల కోట్ల అప్పుల్లో ఉన్న ఆర్టీసీని కాపాడేందుకు ప్రభుత్వంలో వైఎస్ జగన్ విలీనం చేశారు. జీతభత్యాల ఖర్చు ప్రభుత్వం భరించేలా జగన్ చర్యలు తీసుకున్నారు. కానీ ఈ ప్రభుత్వం ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేస్తోంది. సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో పీపీపీ మోడల్‌లో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను పెడుతున్నారు. జీవో 74 ద్వారా రాష్ట్రంలో ప్రజలకు కావాల్సిన ప్రతీ సేవను పీపీపీకి అప్పగించేస్తున్నారు. జీతాలక్క డబ్బులన్నీ పోతున్నాయని చంద్రబాబు చెబుతున్నారు. ఇప్పటికే రూ. 3లక్షల 95 వేల కోట్లు అప్పులు తెచ్చారు. ప్రజల సొమ్మును వయోబులిటీ గ్యాప్ ఫండింగ్ పేరుతో దోచిపెడుతున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలు

## కార్యకర్తల ఐక్యతే పార్టీకి కొండంత బలం

## ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, జిల్లా పరిశీలకులు, జిల్లా అధ్యక్షుల పిలుపు



**నరసరావుపేట, రాజధాని వాయిస్** నరసరావుపేట నియోజ కవర్గ కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమ ంలో పల్నాడు జిల్లా ఎన్నికల పరిశీలకులు కొమ్మినేని నారాయణ, పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ జాన్ సైదా,స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథులు గా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల తో ఆత్మీయంగా సమావేశమై పార్టీ కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయం తదితర కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా రానున్న మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా శ్రేణులను సమాయత్తం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.సమావేశంలో నేతలు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన జీవనాడి అని కొనియాడారు. నాయకులు, కార్యకర్తలు ఒకే తాటిపై నడిచి పరస్పర సమన్వయంతో పనిచేస్తే ఏ ఎన్నికల్లోనైనా తిరుగులేని విజ యం సాధించవచ్చని స్పష్టం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో నరసరావుపేట పురపాలక సంఘంపై పసుపు జెండా ఎగురవే యడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి వార్డులోనూ బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేసి, ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, పట్టణాభివృద్ధి కార్యక్రమా లను గడపగడపకూ చేరవేయాలని సూచించారు. కార్యకర్తలకు పార్టీ నాయకత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాయకులు నేరుగా శ్రేణులతో మమేకమై వారి అభిప్రా యాలను తెలుసుకోవడంతో సమావేశంలో నూతనోత్సాహం వెల్లివిరిసింది. మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా అంకితభావంతో పనిచేస్తామని కార్యకర్తలు ప్రతినబూనారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు, మండల, పట్టణ స్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీ వివిధ విభాగాల బాధ్యులు, వార్డు ఇన్‌ఛార్జ్‌లు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీ సత్తా: టీవీఎస్ లూకాస్‌లో 163 మందికి కొలువులు



**గుంటూరు, రాజధాని వాయిస్** : స్థానిక వింజనంపాడు లోని కేకేఆర్ అండ్ కె ఎస్ ఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కిట్స్) కళాశాల విద్యార్థులు ప్రాంగణ నియామకాలలో విశేష ప్రతిభ కనబరిచి ప్రముఖ బహుళజాతి సంస్థ టీవీఎస్ - లూకాస్ లిమిటెడ్, చెన్నై కంపెనీకి ఎంపికయ్యారు. ఈ నియామకాల్లో కళాశాలకు చెందిన 163 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు సంవత్సరానికి రూ. 3 లక్షల వార్షిక వేతన ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలు పెంపొందించుకోవడం వల్లే ప్రతిష్టాత్మక టీవీఎస్ సంస్థలో ఇన్ని ఉద్యోగాలు సాధించగలిగారని కొనియాడారు.భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.కార్యదర్శి శ్రీ కోయి శేఖర్ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించడమే కిట్స్ ప్రాథమిక ధ్యేయమని, ఈ విజయం కళాశాల నాణ్యమైన విద్యకు నిదర్శనమని పేర్కొన్నారు.ప్రిన్సిపల్ డాక్టర్ పి. బాబు గారు ఉ డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు గారు మాట్లాడుతూ తొలి ప్రయత్నంలోనే భారీ సంఖ్యలో విద్యార్థులు ఎంపిక కావడం హర్షణీయమని, విద్యార్థులు తమ వృత్తిపరమైన జీవితంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు. ప్లేస్‌మెంట్ హెడ్ శ్రీ సి. హెచ్. చంద్రశేఖర్ రెడ్డి కళాశాలలో అందించిన ప్రత్యేక ప్లేస్‌మెంట్ శిక్షణ, కోడింగ్, ఆప్టిట్యూడ్ మరియు సాఫ్ట్ స్కిల్స్ తరగతులే విద్యార్థుల ఈ విజయానికి ప్రధాన కారణమని వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాల అధిపతులు , అధ్యాపక బృందం, ప్లేస్‌మెంట్ విభాగం ప్రతినిధులు మరియు ఎంపికైన విద్యార్థిని విద్యార్థులు పాల్గొని సంతోషాన్ని వ్యక్తపరిచారు.

## దీపావళి నాటికి నంది వెలుగు రోడ్డు ఆర్‌ఓబీ అందుబాటులోకి



**గుంటూరు, రాజధాని వాయిస్** : దీపావళి నాటికి నందివెలుగు రోడ్ ఆర్ఓబి ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా పనుల వేగవంతం...కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్2013-14లో మంజూరై, 2017లో పనులు ప్రారంభమై గత పదేళ్లుగా నిలిచిపోయిన నందివెలుగు రైల్వే వంతెన పనులను పునరుద్ధరించి, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు వేగవంతం చేశామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం నగర కమిషనర్ కె.మయూర్ అశోక్, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, రైల్వే, జిఎంసి, ఆర్‌డబి అధికారులతో కలిసి నందివెలుగు రోడ్ లోని ఆర్ఓబి నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తొలుత ఇప్పటి వరకు జరిగిన పనులు, పెండింగ్ పనులపై అధికారులను, కాంట్రాక్టర్ ని వివరాలు అడిగి తెలుసుకొని, మాట్లాడుతూ, సుదీర్ఘకాలం నిలిచిపోయిన ఆర్ఓబీ పనులన్నింటినీ దాదాపు రూ.39 కోట్లతో రీ-టెండర్ నిర్వహించి పనులను పునఃప్రారంభించామన్నారు. ప్రస్తుతం పనులన్నీ తుది దశకు చేరుకున్నాయని, దాదాపు దీపావళి సమయానికి వంతెనను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.పనుల్లో ఎదురవుతున్న గ్రావెల్ కొరత, ఒకవైపు ఉన్న గుడి వద్ద ట్రాఫిక్ సమస్యలను స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుంటూ క్లియర్ చేస్తున్నామని తెలిపారు. అలాగే పనుల నిమిత్తం రైల్వే గేట్‌ను రెండు రోజుల పాటు మూసివేసి పనులు పూర్తి చేయడంతో పాటు, మున్సిపల్ కార్పొరేషన్ సహాయంతో బ్రిడ్జి కింది ప్రాంతాన్ని సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు డిసెంబర్ 15 వరకు గడువు కోరినప్పటికీ, అదనపు సిబ్బందిని లేదా సబ్-కాంట్రాక్టర్లను ఉపయోగించి అంతకంటే ముందే పనులను ఫాస్ట్ ట్రాక్ చేసి పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

# రూ.8.50 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**గుంటూరు, రాజధాని వాయిస్** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రూ.8.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురా లు గళ్ళా మాధవి శనివారం శంకుస్థాపన చేశారు. డివిజన్లలో రోడ్లు, సీసీ డ్రెయిన్లు, ఆర్‌సీసీ అవుట్‌ఫాల్ డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టనున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 21వ, 25వ, 43వ, 49వ డివిజన్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ డివిజన్లలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంతో పాటు కొత్తగా అవసరమైన సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, అవుట్‌ఫాల్ డ్రైన్లు, కల్వర్టులు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి రూ.8.50 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు.ఈ నాలుగు డివిజన్లలో గత రెండేళ్ల కాలంలోనే ఇప్పటికే రూ.53 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం చేపడుతున్న పనులతో కలిపి ఈ ప్రాంతాల్లో మొత్తం రూ.70 కోట్లకు చేరువలో అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక పనులు పూర్తయ్యాయని, మిగిలిన రోడ్లు, డ్రైనేజీ మరియు ఇతర మౌలిక వసతుల సమస్యల పరిష్కారంపై కూడా ప్రత్యేక దృష్టి సారించి త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు.డివిజన్ అధ్యక్షులు, స్థానిక నాయకులు నిరంతరం ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకురావడం వల్లే అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేయగలుగుతున్నామని చెప్పారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, కార్పొరేషన్ సిబ్బంది సమన్వయంతో అంచనాలు సిద్ధం చేసి పనులు ప్రారంభించడంలో సహకరించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు.రానున్న ఏడాది కాలంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి లోటు లేకుండా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రజాప్రతినిధుల బాధ్యతగా భావించి పనిచేస్తున్నామని, నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే దాదాపు రూ.400 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.

# సీనియర్ జర్నలిస్ట్ సూర్య నాయక్‌ను పరామర్శించిన మాదల చైతన్య



**గుంటూరు, రాజధాని వాయిస్** : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న గుంటూరు జిల్లా సీనియర్ జర్నలిస్ట్ నాయక్ ను జన చైతన్య గ్రూపు అధినేత, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాదల చైతన్య శనివారం అరండల్ పేటలో ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, వైద్యులు సూచించిన విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడిన మాదల చైతన్య... నాయక్ ఆరోగ్య పరిస్థితి, ప్రస్తుతం తీసుకుంటున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి సాధారణ జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు..

**ఆర్థిక సహాయం అందజేత**

సూర్య నాయక్ అనారోగ్య పరిస్థితిని తెలుసుకున్న మాదల చైతన్య తన వంతు సహాయంగా రూ 25,000 ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాదల చైతన్య మాట్లాడుతూ...సమాజం కోసం నిరంతరం పనిచేసే జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాంటి సీనియర్ జర్నలిస్ట్ సూర్య నాయక్ రోడ్డు ప్రమాదానికి గురికావడం బాధాకరమన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అవసరమైన సమయంలో నా వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు..

**జర్నలిస్టుల సేవలు అభినందనీయం**

ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని మాదల చైతన్య పేర్కొన్నారు. ప్రజల కోసం పనిచేసే జర్నలిస్టులకు సమాజం ఎల్లప్పుడూ అండగా ఉండాలని అన్నారు.సూర్య నాయక్ త్వరగా కోలుకుని మళ్లీ తన వృత్తి బాధ్యతల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం కుదుటపడే వరకు కుటుంబ సభ్యులు, మిత్రులు ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా సూర్య నాయక్ కుటుంబ సభ్యులు మాదల చైతన్యకు కృతజ్ఞతలు తెలిపారు. అనారోగ్యం సమయంలో కష్ట కాలంలో పరామర్శించి, ఆర్థిక సహాయం అందించడం పట్ల తమ కుటుంబానికి ఎంతో ధైర్యం కలిగిందని పేర్కొన్నారు.. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం ఫౌండర్ ప్రెసిడెంట్ చెవుల కృష్ణాఆంజనేయులు ఆధునిక ఆసుపత్రి డెవలప్మెంట్ కోఆర్డినేటర్ పంతగాని యోహాను బాబు, వల్లంశెట్టి రమేష్, పాల్గొన్నారు...

# బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటోంది వైసీపీనే: కన్నా లక్ష్మీనారాయణ



**సత్తెనపల్లి, రాజధాని వాయిస్** : సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రెస్ మీట్, ఎన్టీఆర్ హయాంలో బిసిల పక్షాన నిలబడిన రాజకీయ పార్టీ టీడీపీ.చంద్రబాబు కూడా అదే విధానాన్ని కొనసాగించారు.2024 ఎన్నికల్లో బిసిలకు కూటమి 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే , వైసీపీ 24శాతం రిజర్వేషన్ కల్పించింది.స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో ప్రభుత్వం చట్టం చేస్తే ,వైసీపీ కోర్టు కు వెళ్లి అడ్డంకులు కల్పిస్తున్నారు.బిసి రిజర్వేషన్లు అడ్డుకుంటున్న వైసీపీ, స్థానిక ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్ కల్పించాలని టీడీపీ ప్రయత్నం, బిసిలకు కూటమి అన్యాయం చేస్తుందని వైసీపీ తప్పుడు ప్రచారం.మొదటి నుంచి వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. వైసీపీ పార్టీకి గొడ్డలి పార్టీ అని కొత్త పేరు పెట్టారు. వైస్ రాజశేఖర్ రెడ్డి కి అబద్దం చెప్పటం చేతకాదు ..జగన్ కు నిజం చెప్పటం చేతకాదు, ఒక్క సారి కూడా జగన్ నిజం చెప్పలేదు.అబద్ధాలు మోసాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్న వైసీపీ, జగన్ ఒక్క చాన్స్ తో ప్రజలు మోసపోయారు. 2024ఎన్నికల్లో ప్రజలు జగన్ కు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు, 2024ఎన్నికలలో ప్రజలు జగన్ తిరస్కరించారు. జగన్ పద్దతి మార్చుకోవాలి.

# బుర్రిపాలెంలో సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



**తెనాలి,రాజధాని వాయిస్** : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్టోబర్ 4న తెనాలి మండలం బుర్రిపాలెంలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి హెప్సీబా రాణి కొర్లపాటి, జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ శనివారం బుర్రిపాలెంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు.అక్టోబర్ 4న ఉదయం 10.30 గంటలకు పీఎంఏవై--గ్రామీణ్ పథకం కింద మంజూరైన గృహ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా బుర్రిపాలెం గ్రామ పొలిమేరల్లో బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సభకు హాజరయ్యే ప్రజలు, అధికారులు కూర్చునేందుకు అవసరమైన సదుపాయాలతో పాటు తాగునీరు, మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని మంత్రులు, అధికారులు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, అదనపు ఎస్పీ ఎ.టి.వి. రవికుమార్, జడ్పీ సీఈవో వి. జ్యోతిబసు, తెనాలి ఆర్డీవో కె. శ్రీరమణి, గుంటూరు ఆర్డీవో కె. శ్రీనివాసరావు, డీఎస్పీ బి. జనార్ధనరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కె. కళ్యాణ చక్రవర్తి, డీపీవో బి.వి. నాగసాయికుమార్, హౌసింగ్ పీడీ జె.వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, తహసీల్దార్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

# వైయస్సార్‌సీపీ నేతల విమర్శలపై టీడీపీ మండల అధ్యక్షుడు మండిపాటు

**రాయచోటి, రాజధాని వాయిస్** రాయచోటి లోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో రాయచోటి రూరల్ టిడిపి మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ తో వైసీపీ పార్టీలో వణుకు పుట్టిందన్నారు. రాయచోటి నియోజకవర్గం నుండి చలో మదనపల్లెకు మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో అశేష జనవాహిని తరలి వెళ్లడం చూసి వైసిపి నాయకులకు మతిభ్రమించిందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.లక్ష కోట్ల రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అంటే మామూలు విషయం కాదని, పది జిల్లాల్లో 201 క్లస్టర్లలో అభివృద్ధి ప్రణాళిక అని తెలిపారు. వైసీపీ నాయకులు కరువు వచ్చిందని దాని గురించి సహేతుకంగా మాట్లాడడం లేదని, ఏదో మాట్లాడాలని మాట్లాడుతున్నారే తప్ప అందులో విషయమే లేదన్నారు. చంద్రబాబు నాయుడుని విమర్శించే అర్హత వారికి లేదని,ఎల్ ని నో ప్రభావంతో ప్రపంచమంతా వర్షపాతం తక్కువగా నమోదు అవుతున్నదని తెలిసినా కూడా విమర్శించడం తగదన్నారు.మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కరోనా మహమ్మారితో రాష్ట్ర ప్రజలు దుర్భర పరిస్థితులు గడిపారని తల్లి ఒకచోట బిడ్డ ఒకచోట బ్రతకవలసి వచ్చిందని ఆ రోజు తమ పార్టీ వాళ్లు కష్టానికి సహకరించారే గాని మీలాగా నీతి తప్పి ప్రవర్తించి మాట్లాడలేదన్నారు. ప్రపంచంలోని దిగ్గజ దేశాలు, బిల్ గేట్స్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు కూడా భావితరాలకు ముందు చూపును చూపించే నాయకుడు చంద్రబాబు నాయుడు గారేనని పొగుడుతుంటే మీరు విమర్శించడం ఎంతవరకు సమంజసం అన్నారు.

ఇలాంటి కరువు పరిస్థితులు వచ్చినప్పుడే కదా ధైర్యంగా ముందుకు నిలబడి, వర్షపాతం తక్కువ గా నమోదైన గాని రాయలసీమను రత్నాలసీమగా చూడాలని సంకల్పంతో నదుల అనుసంధానం చేయాలని పట్టుదలతో పని చేస్తున్న ఉక్కుమ నిషి మా చంద్రబాబు నాయుడు గారని కొనియాడారు. వైసీపీ నాయకులు కరువును కూడా రాజకీయంగా వాడుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ బసయ్య, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కోటకొండ రవిశంకర్, పల్లపు మల్ రెడ్డి, ఉదయగిరి మస్తాన్వలి తదితరులు పాల్గొన్నారు.

## క్రైమ్ ప్రోన్ ప్రాంతాలపై డ్రోన్ నిఘా

**బాపట్ల, రాజధాని వాయిస్** బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాలపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా చేపట్టింది. క్రైమ్ ప్రోన్ ప్రాంతాలను గుర్తించి డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. నేరాల నివారణ, ప్రజల భద్రత లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని కీలక ప్రాంతాలు, సున్నిత ప్రాంతాలు, గతంలో నేరాలు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. డ్రోన్ కెమెరాల సహాయంతో అనుమానాస్పద కదలికలను గుర్తిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. అవసరమైన చోట వెంటనే పోలీసు బృందాలను అప్రమత్తం చేసే విధంగా వ్యవస్థను వినియోగిస్తున్నారు.నేర నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా పోలీసు శాఖ మరింత సమర్థవంతంగా పనిచేస్తోందని అధికారులు తెలిపారు. డ్రోన్ పర్యవేక్షణ వల్ల విస్తృత ప్రాంతాలను తక్కువ సమయంలో పరిశీలించే అవకాశం లభిస్తోందన్నారు. దీంతో అనుమానాస్పద కార్యకలాపాలను వేగంగా గుర్తించే వీలుంటుందని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే ప్రధాన లక్ష్యమని పోలీసులు వెల్లడించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికల పర్యవేక్షణలో డ్రోన్ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు .జిల్లాలోని ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుందని తెలిపారు. డ్రోన్ నిఘా కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిరంతరంగా కొనసాగించనున్నట్లు పోలీసులు వెల్లడించారు. నేరాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతూ ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# పిఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు




**రాజుపాలెం.అక్టోబర్ 03, రాజధాని వాయిస్ :** రేపటి మెరుగైన సమాజం కోసం నైతిక విలువలతో కూడిన విద్య ను అందిస్తూ, సమాజ స్థాపనే ధ్యేయంగా స్థాపించబడిన కె.ఎన్.ఆర్ విద్యాసంస్థల ఆద్వర్యంలో పిడుగురాళ్ళ కొండమోడులో నడుపబడుచున్న పిఎస్ ఆర్ డిగ్రీ కళాశాలలో డైరెక్టర్స్ కోనేటి నరసింహా రావు,బాడిశ మస్తాన్ రావు నిర్వహణలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతి థిగా ఎస్బిఐ అసిస్టెంట్ మేనేజర్ పూర్వ విద్యార్థి అరవింద్ రెడ్డి మాట్లాడుతూ, భవిష్యత్తు మంచి అవకాశాలు పొందటానికి ఉన్నత విలువలతో కూడినటువంటి వ్యక్తిత్వం కలిగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.ఈ సందర్బంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు,పాటలు,డ్రాన్స్ లు,స్కిట్ లు పలువురిని ఆకట్టుకున్నాయి.ఈ సందర్బంగా కళాశాల డైరెక్టర్స్ మాట్లాడుతూ, కెఎన్ఆర్ విద్యాసంస్థల ఆద్వర్యంలో ఇంటర్మీడియట్,డిగ్రీ వరకు విద్యను దీటుగా సామాన్య విద్యార్థులతో అసామాన్య ఫలితాలు సాధిస్తున్నామని విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని,నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులు కనుక,విద్యార్థులను దేశాభివృద్ధికి తోడ్పడే విధంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నాగులేరు అభివృద్ధి కోసం మా వంతు ముందడుగు

**చారిత్రక ప్రదేశం అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని అధికారుల హామీ**



**కారంపూడి.అక్టోబర్ 03రాజదాని వాయిస్ :** చారిత్రక ప్రాధాన్యత కలిగిన నాగులేరు అభివృద్ధి కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అధికారులు తెలిపారు. నాగులేరు పరిసరాల్లో కొనసాగుతున్న పార్కు అభివృద్ధి పనులను కారంపూడి తహసీల్దార్ వెంకటేశ్వర నాయక్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, విద్యుత్ శాఖ ఏ.డి. ఆనందరావు, ఏ.ఈ. రమణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి,అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యుత్ సంబంధిత అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.నాగులేరు చరిత్రను భవిష్యత్ తరాలకు గుర్తుండేలా అభివృద్ధి చేయడానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని అధికారులు విలేకరులతో తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన నాగులేరు అభివృద్ధిలో గ్రామ ప్రజలు కూడా భాగస్వాములై తమ వంతు ముందడుగు వేయాలని వారు సూచించారు.నాగులేరు అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా, గ్రామ ప్రజలందరి సమిష్టి భాగస్వామ్యంతోనే చారిత్రక ప్రదేశానికి మరింత గుర్తింపు తీసుకురావచ్చని అధికారులు పేర్కొన్నారు.

# బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు



**కారంపూడి. అక్టోబర్ 03 రాజదాని వాయిస్ :** ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ 14 మరియు అండర్ 17 బాల బాలికల రెజ్లింగ్ పోటీలు ముమ్మరముగా కొనసాగుతున్నాయి ఈ పోటీలను ప్రధానోపాధ్యాయుడు ఐ.శివ శేషిరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి సుమారుగా 400 మంది విద్యార్థులు రెజలింగ్ లో పాల్గొన్నారని ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వర్ణ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రెజ్లింగ్ వ్యాయామ ఉపాధ్యాయులు భూషణం,ఆనంద్,మనోహర్, రత్నరాజు,అమల,సుస్మిత జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విచ్చేసిన వ్యాయామ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మరియు బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న కామినేని సైదయ్య బాలబోయిన హనుమంతరావు



**వెల్దుర్తి. అక్టోబర్ 03 రాజధాని వాయిస్ :** మండలంలోని మండాది, పట్లవీడు, యర్రబాలెం, ముటుకూరు వెళ్ళే రహదారి. నెల క్రితం మిషన్ భగీరధ కార్యక్రమంలో భాగంగా వాటర్ పైపులు కోసం తారు రోడ్డు మీద తవ్వి పైపులు వేయటం జరిగింది. సరిగ్గా పూడ్చకపోవటంతో పైపులు కోసం తవ్విన చోటు పెద్ద గాడి ఏర్పడింది. దీంతో ఈ రూట్లో తిరిగే ఆర్టీసీ బస్సు వారు, స్కూల్ బస్సుల వారు, ద్విచక్ర వాహనదారులు, ఆటో వారు, ట్రాక్టర్ వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారి బాధలు చూడలేని యర్రబాలెం గ్రామానికి చెందిన కామినేని చిన్న సైదయ్య, జనసముద్రం న్యూస్ మాచర్ల నియోజకవర్గం ఇన్చార్జి, జర్నలిస్ట్ బాలబోయిన హనుమంతరావు ఇద్దరూ కలిసి మానవత్వంతో కష్టపడి రోడ్డు మీద గాడిని శనివారం పూడ్చి వేశారు. దీంతో ఆ రూట్లో తిరిగే ఆర్టీసీ బస్ డ్రైవర్ బండారు రాంబాబు, పలువురు ద్విచక్ర వాహనదారులు మంచి పని చేశారయ్యా అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం వైకాపా ఆరోపణ

**- ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి బకాయిలు చెల్లించాలి జి. మట్టారెడ్డి డిమాండ్**



**పిడుగురాళ్ల. అక్టోబర్ 03 రాజధాని వాయిస్ :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసిపి పల్నాడు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు జి. మట్టారెడ్డి విమర్శించారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి సూచనల మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఆడబిడ్డ నిధి, యువతకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. ఇప్పటివరకు జమ చేయాల్సిన బకాయిలను వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన నిలబడతానని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, గత ప్రభుత్వం అమలు చేసిన 'కాపు నేస్తం' వంటి సంక్షేమ పథకాలు ఆగిపోవడంపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.గత ఐదేళ్ల పాలనలో వైఎస్ జగన్మోహన్రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి సంక్షేమాన్ని అందించారని, కాసు మహేష్ రెడ్డి నాయకత్వంలో గురజాల నియోజకవర్గం ప్రగతి పథంలో పయనించిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టడం మానుకుని, ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# రైతు కష్టాలు తెలుసుకున్న జూలకంటి వరికపూడిశెలపై కీలక హామీ



**వెల్దుర్తి. అక్టోబర్ 03 రాజధాని వాయిస్ :**వరికపూడిశెల ప్రాజెక్టు పనులు ప్రారంభించి, వచ్చే ఏడాది నాటి రైతులందరికీ సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండలంలో సుడిగాలి పర్యటన చేసిన ఆయన,గంగలకుంట గ్రామ శివారు పత్తి పొలంలో పనులు చేస్తున్న కూలీలతో ముఖాముఖి నిర్వహించారు. వారితో పాటు పత్తిని తీస్తూ.. రైతుల సాధకబాధలను అడిగి తెలుసుకున్నారు. అన్నదాత సుఖీభవ, రైతు సంక్షేమ పథకాలతో రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. అనంతరం అక్కడే ఉన్న వీరస్వామి చెరువును పరిశీలించి, సాగునీటి నిల్వకు అవసరమైన పరిస్థితిని పర్యవేక్షించారు.

# పల్లెపల్లెన ప్రగతి బాట

**- అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జూలకంటి శ్రీకారం**



**వెల్దుర్తి. అక్టోబర్ 03 రాజధాని వాయిస్ :** పల్లెపండుగ--3.0 కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్--గ్రామీణ' పథకం నిధులతో పల్లెపల్లెన మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. శనివారం వెల్దుర్తి మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం రూ.1.30 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమిపూజలు నిర్వహించారు. గొట్టిపాళ్ల గ్రామంలో రూ.20 లక్షలతో, శిరిగిరిపాడులో రూ.40 లక్షలతో, రచ్చమల్లపాడులో రూ.30 లక్షలతో, మండాది గ్రామంలో రూ.40 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు.అనంతరం మండాది గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

**ప్రభుత్వ విద్యలో వినూత్న సంస్కరణలు**

దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా ప్రభుత్వ విద్యా రంగంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వినూత్న సంస్కరణలు తీసుకొస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా తీసుకుంటున్న నిర్ణయాలు భావితరాలకు ప్రయోజనం చేకూరుస్తాయని అన్నారు.బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించిందని, దీనిపై న్యాయపరమైన అంశాలను ఎదుర్కొంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. బీసీలకు సామాజిక న్యాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.గత ప్రభుత్వ పాలనలో బీసీ సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఎమ్మెల్యే ఆరోపించారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అలజడులు సృష్టించే ప్రయత్నాలు జరిగితే సహించేది లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనించి స్థానిక ఎన్నికల్లో అభివృద్ధికి మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు గొట్టిపాళ్ల మధు, కళ్లం రామాంజిరెడ్డి, మందలపు రామకృష్ణ, జూలకంటి చిరంజీవిరెడ్డి, అక్కిరెడ్డి, పాపిరెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతు బిడ్డల చదువులకు సైకిళ్ల వెన్నుదన్ను

**త్వరలోనే 20 కంప్యూటర్లతో హైటెక్ ల్యాబ్ ప్రారంభం**

**టిడిపి కార్యాలయంలో 30 సైకిళ్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**



**నరసరావుపేట, రాజధాని వాయిస్** పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి అన్ని విధాలా అండగా నిలిచి నాణ్యమైన విద్య, మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ల ఆలోచనల మేరకు అమలు చేస్తున్న 'పి4' (P4 - Public Private People Partnership) విధానంలో భాగంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు,దాతల సహకారంతో నియోజకవర్గంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ఇందులో భాగంగా 'భారత్ ఫౌండేషన్' (ఛైర్మన్ సజ్జా వెంకటేశ్వర్లు, ప్రతినిధుల) సహకారంతో నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 150 మంది పేద విద్యార్థులకు ఉచితంగా నూతన సైకిళ్లను పంపిణీ చేశారు.వీటిలో కోటప్పకొండ వద్దనున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న గ్రామీణ విద్యార్థులకు 120 సైకిళ్లు అందజేయగా, నరసరావుపేట టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మిగిలిన 30 సైకిళ్లను పేద విద్యార్థులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు స్వయంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబాలు, నిరుపేద వర్గాల పిల్లల చదువులకు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా ఉంటానని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద రైతులు, వ్యవసాయ కూలీల బిడ్డలు దూరప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, కొత్త సైకిళ్లు కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్న వారికి ఈ సాయం ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా బడులకు వెళ్లి చదువులో రాణించేందుకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే విద్యార్థుల కోసం తల్లికి వందనం, స్కూల్ బ్యాగులు, స్టడీ మెటీరియల్స్, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజన పథకాలను పకడ్బందీగా అమలు చేస్తోందని తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు సీఎస్సార్ నిధులు, దాతల తోడ్పాటుతో 20 కంప్యూటర్లతో కూడిన హైటెక్ ల్యాబ్‌ను త్వరలోనే జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో ఇప్పటికే ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతల సాయంతో 14 ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి సురక్షిత తాగునీరు అందిస్తున్నామని గుర్తుచేశారు. విద్యార్థుల సంక్షేమం, ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న టీడీపీ,జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పోలీస్ సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ

**- పోలీస్ కుటుంబాల రక్షణపై మోహనరావు దృష్టి**
**- తుహిన్ సిన్హా చొరవతో అవగాహన సదస్సు**
**- బీమా పథకాలపై వివరించిన బ్యాంకు ప్రతినిధులు**



**అనకాపల్లి, రాజధాని వాయిస్ :** పోలీస్ సిబ్బంది, హోంగార్డుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య బీమా, సామాజిక భద్రతా పథకాలు, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు రక్షణ కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది, హోంగార్డుల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్య ఖర్చులు భారీగా పెరుగుతున్నందున సాధారణ వైద్య సదుపాయాలతో పాటు అదనపు బీమా రక్షణ కూడా అవసరమని పేర్కొన్నారు. సిబ్బంది తమ కుటుంబాల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలు ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరమని మోహనరావు వివరించారు. ఈ పథకాల ద్వారా ప్రమాదాలు, అనారోగ్య పరిస్థితులు, భవిష్యత్ అవసరాల సమయంలో కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుందని చెప్పారు. ప్రతి పోలీస్ సిబ్బంది, హోంగార్డు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ బ్యాంకుల ప్రతినిధులు పోలీస్ శాలరీ ప్యాకేజీ కింద లభించే ఆరోగ్య బీమా పథకాలపై వివరించారు. కుటుంబ ఆరోగ్య బీమా, తక్కువ ప్రీమియంతో అధిక రక్షణ, నగదు రహిత వైద్య సేవలు, అదనపు బీమా సదుపాయాల గురించి సమగ్రంగా అవగాహన కల్పించారు. వివిధ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సేవలు, బీమా ద్వారా పొందగల ప్రయోజనాలను కూడా వివరించారు. సిబ్బంది అడిగిన ప్రశ్నలకు బ్యాంకు ప్రతినిధులు సమాధానాలు ఇస్తూ నమోదు ప్రక్రియ, అర్హత ప్రమాణాలు, బీమా రక్షణ పరిధిపై స్పష్టత ఇచ్చారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించడంలో బీమా పథకాలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరైన పథకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బాబ్జీరావు, రవికుమార్, సీఐలు రామకృష్ణారావు, లక్ష్మి, శ్రీనివాసరావు, రమేష్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, హోంగార్డులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సిబ్బంది సంక్షేమం, ఆరోగ్య భద్రత కోసం ఇటువంటి అవగాహన కార్యక్రమాలు మరింత ఉపయోగపడతాయని అధికారు లు పేర్కొన్నారు. పోలీస్ కుటుంబాలకు ఆర్థిక, ఆరోగ్య పరిరక్షణ కల్పించే దిశగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com